# బూడిద

భారత ఖండంలో భవిష్యత్తు మీద బంగారు కలల్ని పేర్చుకుంటూ- బాధల బరువుల్ని మోస్తూ-శ్రమిస్తూ చెమటలు కారుస్తూ-కష్టాలు కనకాల్ని కురిపించక పోతాయా - కన్నీళ్ళు కాంతుల్ని వెదజల్లక పోతాయా అని ఆశిస్తూ ఒక్కొక్క వడ్లగింజనూ తమ నివాసానికి చేరుస్తూ దాచేస్తూ చీమలు' చిరుచీమలు.

పుణ్య భూమ్మీది పచ్చికలో చెంగు చెంగున గెంతుతూ-పచ్చిక చిగుళ్ళను కొరుకుతూ - పరపరా నములుతూ - ఆడుతూ పాడుతూ పరుగెత్తుతూ - ఆనందంగా ఆగి - సుతారంగా సునాయాసంగా ఒక్కొక్క వడ్లగింజనీ నోట్లో వేసుకొంటూ చీమల ఆశల్ని కర్కశంగా తినేస్తూ ఎలుక- చిట్టెలుక.

మీసాలకుఅంటుకున్న పాలమీగడను హుందాగా నాలుకతో తుడుచుకొని - మీసాలు మెలివేసుకుని - వసుంధర వాళ్ళు ఎక్కడ కంది పోతుందో అని పించేలా నటిస్తూ - కాళ్ళస్పాంజ్‌ని సున్నితంగా నేలపై మోపి నడుస్తూ ఉత్సాహంగా ఎలుక మీదకి పిల్లి, మచ్చల పిల్లి.

అటూ యిటూ చూస్తూ - పళ్ళల్లో పడ్డ మాంసం గొలుక్కుంటూ తీవిగా నడుస్తూ- తోకాడిస్తూ- వాసన చూపి, తోకాడించటం మానేసి- ముందుకాళ్ళు కొద్దిగా ముందుకు వంచి ఒక్కసారిగా బలంగా పిల్లి మీదకి కుక్క, తెల్లకుక్క.

*  *  *

"ఏటే, కాసులూ! ఇయేళ మాంచి వుసారుగా వున్నావ్?"

"పెద్ద నువ్వు లేనట్టు. మావా, యిళ్లు కట్టేసరికి యెన్నాళ్ళు పడతాదంటావ్?

"ఒకారు నెలల్లో ఐపోతాదంట, మనం రెండ్రోజుల్లో యీ గుడిసెల్ని కాళీ చేసెయ్యాలి. గుడిసెల్ని తీసేసి, పని మొదలెడతారట."

"యిళ్ళు కట్టేదాకా మనం ఎక్కడుండాల మావా?"

"నువ్వేం దిగులుపడమాక. నేనిందాక మనోళ్ళందరితోటి కల్సి సన్నాసిగాడి దగ్గర కెళ్ళేను. ఆడు-ఆడి సుట్టాలందరితోటి సెప్పేడు. ఆళ్ళందరూ ఆళ్ళింటి పంచల్లో ఒకో కుటుంబాన్ని వుంచుకోడానికి వొప్పుకున్నారు."

"సన్నాసిగాడ్ని యిన్నాళ్ళనుంచీ తిట్టుకుంటున్నాం గానీ ఆడిప్పుడు మంచి వుపకారం సేసేడు మావా, మన మీదాడికి కోపం ఏపీ లేదన్నమాట"

"అనే అనుకోవాల మరి"

ప్రభుత్వంవారి స్థలంలో వున్న ఎన్నో పూరిగుడిసెల్లో-ఒక గుడిసె లోని సూరన్న, కాసుల సంభాషణ.

ఆ వేళ ఆ వూరి గుడిసెల్లోని జనం అందరి కళ్ళల్లోనూ కాంతి -

వాళ్ళ మనసుల్లో ఎంతో శాంతి.

ఆ రోజు ఉదయం జీపు రావడం - హరిజనుల మెంబరు సన్నాసి తమతో కలెక్టరు గారొచ్చారని చెప్పడం-ప్రెసిడెంటూ, మునసబు కరణాలూ కలెక్టరుగారికి నమస్కారాలు చెయ్యడం-కలెక్టరు శంకుస్థాపన చెయ్యడం-ఉపన్యసించడం - హరిజనుల గురించి ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ - చేస్తున్న సేవ - ఇవన్నీ వాళ్ళందరి కళ్ళల్లోనూ కదులుతున్నాయి. వాళ్ళ హృదయాన్ని ఉబ్బిస్తున్నాయి.

* * *

కంట్రాక్టరు వచ్చాడు. ముందుగా ప్రెసిడెంటునీ, మునసబునీ కలిశాడు తర్వాత సన్నాసి దగ్గరకి వచ్చాడు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలం దగ్గరకి కంట్రాక్టర్ని సన్నాసి తీసుకువచ్చాడు కంట్రాక్టర్ పూరి గుడెసెల్ని పీకించేశాడు.

ఆ పూరి గుడిసెల్లో వుండే కాసులు కానీ, సూరన్న కానీ, మిగిలిన వాళ్ళు కానీ పూరి గుడిసెలు పీకేస్తున్నప్పుడు అభ్యంతరం చెప్పలేదు. బాధపడలేదు చాలా సంతోషంగా ఉత్సాహంగా గుడెసెల్ని పీకడానికి చేతులు కలిపారు. త్వరత్వరగా పీకేశారు అంత త్వరగానూ యిళ్ళు కట్టి యిచ్చేస్తే బావుండు ననుకున్నారు.

ఆ స్థలం - ప్రభుత్వం వారి స్థలం - గుడిసెల్ని తీసేసిన ఖాళీస్థలం ఒక పల్లెటూరిలో వుంది. ఆ స్థలం ప్రక్కన నిశ్శబ్దంగా నెమ్మదిగా ప్రవహించే కాలవవుంది. మరో ప్రక్కన బస్సులూ, యితర వాహనాలూ తిరిగే తారు రోడ్డు వుంది.

ఆ ఊరికి పంచాయితీ బోర్డు వుంది. అందుచేత ప్రెసిడెంటు వున్నాడు ప్రెసిడెంటుని ఎన్నుకోవడానికి మెంబర్లు కావాలి కనుక మెంబర్లున్నారు. మెంబర్లకోసం ఓటర్లు కూడా వుండక తప్పదు కనుక వాళ్ళూ వున్నారు.

కాసులూ సూరన్నా కూలిపన్చేస్తారు మిగతావాళ్ళలాగానే. కూలి పన్చేస్తారు కాబట్టి అవసరమయినప్పుడల్లా పస్తులుంటారు. పస్తులుంటారు కాబట్టి నీరసంగా వుంటారు. నీరసంగా వుంటారు కాబట్టి తరచూ అనారోగ్యంగా వుంటారు పెద్ద వాళ్ళలాగేనే పిల్లలూ అలాగే వుంటారు.

హరిజనుల మెంబరు సన్నాసికి కాస్త పొలం వుంది. సంతకం పెట్టగల చదువుంది. మాటకారితనం వుంది ప్రెసిడెంటుగారి అభిమానం వుంది. ఆ వూరి గొప్పోళ్ళ దయ వుంది.

సన్నాసి తాటాకుయిల్లు చుట్టూ చిన్న చిన్న గుడిసెలున్నాయి. అవన్నీ సన్నాసి దగ్గరి చుట్టాలవి. సన్నాసి తరపు వాళ్ళకీ కాసులూ సూరన్న తరపు వాళ్ళకీ వాళ్ళ వాళ్ళ పెద్దవాళ్ళనుంచీ చిన్న చిన్న తగవులున్నాయి. అయినా సన్నాసి మాట తీసెయ్యలేక సూరన్నా కాసులూ తరపు వాళ్ళందరికీ తమ తమ యిళ్ళ పంచల్లో కాస్త చోటిచ్చారు.

ఎవరిపన్లోకి కూలీలుకావాలన్నా సన్నాసికి కబురంపుతారు ఆ వూరి భూస్వాములు. సన్నాసి తన వాళ్ళను ఎక్కువ మందినీ, సూరన్నా కాసులు తరపు వాళ్ళని తక్కువ మందినీ తీసుకువెళ్తాడు.

తమ వూరిగుడిసెల స్థానాల్లో లేస్తున్న యిటుక గోడల్నీ - ద్వార బందాల్నీ - అరుగుల్నీ - పైనవేస్తున్న పిలపరు బద్దల్నీ - వాటిమీద వేస్తున్న బంగళా పెంకుల్ని ఎప్పటి కప్పుడు చూస్తూనే వున్నారు. కాసులూ సూరన్నా మిగతావాళ్ళూ.

గోడలకి వెల్లవేస్తున్నట్టూ, గదులన్నీ శుభ్రంగా తుడుస్తున్నట్టూ, అలుకుతున్నట్టూ, ముగ్గులు పెడుతునట్టూ, పిల్లలు ముగ్గులు చెరిపేస్తున్నట్టు, వాళ్ళను తను కోప్పడుతున్నట్టూ కాసులు తరచూ కొత్త ఇంటిని గురించి కలలు కనేస్తోంది.

ఇలాగే అందరూ అందంగా ఆశగా కలలు కంటున్నారు రకరకాలుగా. ఎప్పుడు కడుతూన్న కొత్త యిళ్లల్లోకి పోదామా అని ఎదురు చూస్తున్నారు. సన్నాసిని అడుగుతున్నారు. కంట్రాక్టర్ని అడుగుతున్నారు. మేస్త్రీలని అడుగుతున్నారు - ఇంకా ఎన్నాళ్ళెన్నాళ్ళని!

* * *

కలలు కన్న కమ్మని రోజు వచ్చింది. వాళ్ళకి చైతన్యాన్ని తెచ్చింది, వాళ్ళ ముఖాలకి తృప్తిని యిచ్చింది.

కాసులుకి తెల్లవారే వరకూ నిద్రలేదు. చీకటితోనే తలంటుకుని స్నానం చేసింది. శుభ్రంగా వుతుక్కున్న చీర కట్టింది. పిల్లలకి స్నానం చేయించింది. సూరన్నని కూడా త్వరగా తయారవమంది

వాళ్ళందరూ కడిగిన ముత్యాల్లా తయారయ్యారు. అప్పటి వరకూ మరొకళ్ళ పంచల్లో పడ్డ యాతనల్ని మరచిపోయారు.

కొత్త యిళ్ళ ముందు అయిదడుగుల ఎత్తులో గజం వెడల్పున కట్టిన దానిమీద కలెక్టరు గారు శంకుస్థాపన చేసిన విషయం-ఆయన పేరు. డిగ్రీలు రాసి వున్నాయి. దానికి ప్రక్కన ఇంకా ఎత్తుగా కట్టిన దాని మీద తెల్ల గుడ్డ కప్పివేసి వుంది.

హరిజను లందరూ కొత్త యిళ్ళ ముందు కొత్త కొత్త ఆలోచన్లతో ప్రారంభోత్సవం చెయ్యడానికి రావలసిన మంత్రిగారి కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

ఎండెక్కుతోంది. వాళ్ళల్లో ఆత్రుత పెరుగుతోంది. కడుపుల్లో ఆకలి తిరుగుతోంది. శరీరాలకు చెమట పడుతోంది.

అంతలో చిన్న కారు వచ్చింది. వాళ్ళందరి ముఖాల మీద చిరు నవ్వులు ముద్రించింది.

కారులోంచి మంత్రి గారూ, ప్రెసిడెంటుగారూ, యింకా పేరున్న వార్లూ దిగారు,

మంత్రిగారు తెరలాగి. రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసేరు. తన పేరులో తప్పు లేమీ లేవు కదా అని జాగ్రత్తగా చూసుకున్నారు. తృప్తిగా మళ్ళీ మరోసారి చదువుకున్నారు.

మంత్రిగారి దగ్గర నుంచి మున్సబుగారి వరకూ అందరూ ఉపాన్యాసా లిచ్చారు, సోషలిజం గురించీ, దేశభక్తి గురించీ, మానవత్వం గురించీ ఎన్నెన్నో మాట్లాడారు.

ఆకల్నీ, ఎండనీ, చమటల్నీ చిరాకునీ, పిల్లల ఏడుపుల్నీ, లెక్క చెయ్యకుండా ఎంతో ఓపికగా అంతా విన్నారు.

మధ్యాహ్న మయింది, మంత్రిగారు ప్రెసిడెంటుగారి ఆతిథ్యాన్ని స్వీకరించడానికి చిన్నకారులో వచ్చినంత స్పీడుగానూ వెళ్ళిపోయారు.

కాసులు, సూరన్న, వెంకమ్మ, లచ్చన్న, ఏసేబు-అందరూ వాళ్ళ వాళ్ళ సామానులు హడావుడిగా సర్దుకుంటున్నారు. ఇంకాస్సేపట్లో కొత్త ఇళ్ళల్లో తమ సామాన్లు ఏ విధంగా సర్దుకోవాలో ఆలోచిస్తూ ఆనందంగా-అల్లరి చేస్తున్న పిల్లల్ని కసురుతూ యిటూ అటూ తిరుగుతున్నారు హడావుడిగా.

సన్నాసి గంభీరంగా నడుస్తూ, మీసాలు మెలేస్తూ వచ్చాడు వీళ్ళ హడావుడి చూసేసి నోట్లోని చుట్టని కొంచెం కొరికి, నమిలి, కసరు కాండ్రించి వూసేడు, ఎగా దిగా చూసేడు అందర్నీ. చిన్నగా నవ్వుకున్నాడు.

"ఏవిట్రా! అప్పుడే సామానంతా సర్దేసేరూ. ఇప్పుడే యిళ్ళల్లోకి పోదామనా! భలే వాళ్ళే!! మంచీగించీ చూడక్కరలేదూ? ఈ పూట సుందర్రాజు గారి చేలో పనుంది. మీరంతా వెళ్ళండి. రేపు కూడా పని వుంటాది. నడండి" అని హుందాగా వెళ్ళిపోయాడు సన్నాసి.

కాసులు, సూరన్నా, అంతా ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు ఆశ్చర్యంగా చూసుకున్నారు తెల్లబోయారు. తర్వాత పన్లోకి వెళ్ళిపోయారు.

* * *

చీకటి చిక్కబడుతున్న సమయంలో కాసులు, సూరన్న, అంతా పొలంనుంచి వచ్చారు. తాటాకు యిళ్ళల్లోకి, గుడిసెల్లోకి చూశారు. మళ్ళీ అనుమానంగా చూశారు.

సన్నాసి గాని, అతని చుట్టాలు గాని, ఎవరూ వాళ్ళిళ్ళల్లో లేరు

కాసులు పరుగెత్తుకుని కొత్త యిళ్ళ దగ్గరకి వెళ్ళిచూసింది.

కాసులుకి గుండె ఆగిపోయినంత పనయ్యింది, మెదడు మొద్దుబారి పోయింది. కళ్ళు దృష్టిని కోల్పోయాయి. రక్త ప్రసారం ఆగిపోయింది.

కొంతసేపటికి కాసులు మామూలు మనిషి అయింది. ఏడుపు వచ్చేసింది. గబగబా వెనక్కు వచ్చేసింది. మిగతా వాళ్ళతో తను చూసిన సంగతి చెప్పింది. మొదట ఎవరూ నమ్మలేదు. కొత్త యిళ్ళ దగ్గరకు వెళ్ళిచూసేరు. కొత్త యిళ్ళుకళకళలాడు తున్నాయి. సందడిగా వుంది. హరికెన్ లాంతర్లు యిళ్ళ చూరులకు వేలాడుతూ వెలుగు తున్నాయి.

ఒక కొత్త యింటిలో వున్న సన్యాసితో సూరన్న యిదెక్కడి న్యాయమన్నాడు. ఇది చాలా దారుణమన్నాడు. ఉద్రేకంతో వణికిపోతూ అన్నాడు.

అప్పుడు —

"సూరన్నా, నాదేం లేదు. గవర్నమెంటోళ్ళు ఈ యిళ్ళన్నీ మా కిచ్చారు. వద్దంటే ఏం బావుంటుందని మేం తీసుకున్నాం. మీతో ఈ విషయం చెప్పి బాధ పెట్టడం ఎందుకని యిందాక చెప్పలేదు. మీరంతా మా యిళ్ళల్లో వుండండి. ఒక్కో యింటికి నెలకి అద్దె అయిదు రూపాయలు యివ్వండి. నా యింట్లో ఎవరుంటే వాళ్ళు పది రూపాయలు యివ్వండి. ఆ డబ్బంతా నాకే యివ్వాలి. అందుకు మా వాళ్ళు ఒప్పుకున్నారు. ఇందులో బలవంతం ఏమీ లేదు. మీ కిష్టం లేకపోతే చెప్పండి. మా స్థలాలన్నీ అమ్మేసుకుంటాం" అన్నాడు సన్నాసి తాపీగా సాఫీగా మెత్తగా మాట్లాడుతూ,

" అన్నేయం అన్నేయం అన్నేయం " అని అరుస్తూ పిచ్చిగా వెర్రిగా కోపంగా తన వాళ్ళందరి చుట్టూ తిరుగుతూ సూరన్న.

వాళ్ళ కళ్ళల్లో కాళ్ళల్లో చేతుల్లో ఛాతీల్లో మొదళ్ళల్లో ముఖాల్లో గుండెల్లో నరాల్లో రక్తంలో అగ్ని - బడబాగ్ని - నిటలాగ్ని - మహాదాగ్ని - ప్రజ్వలిస్తూ ఉవ్వెత్తున లేస్తూ జరజరా చరచరా ప్రాకుతూ ప్రవహిస్తూ -

ఆ సమయంలో రావన్న తాత నెమ్మదిగా నీరసంగా నడిచివచ్చాడు. రక్తపు ముద్దల్లావున్న వాళ్ళ ముఖాలు చూసేడు. క్షణకాలం ఆలోచించాడు ఇదివరలో రావన్న తాత చాలాసార్లు. సన్నాసి తరపు వాళ్ళకి, సూరన్న తరపు వాళ్ళకి వచ్చిన తగువుల్ని తీర్చాడు.

" ఒరేయ్, ఒసేయ్, ఏవిట్రా అట్టాగున్నారూ! మిమ్మల్నేరా. మాటాడరేవ్రా. నా మాటలు యిన్పించడంనేదూ. మిమల్ని సూత్తంటే కొంపముంచేసేనాగున్నారే. అసల్మీకు బుర్రలున్నాయా అంట. సన్నాసీ, ఆళ్ళోళ్ళ మీదకి కయ్యానికెళ్తే బతికిబట్టకడదామనే. మీరింత మందమతి ఎదవలైతే ఎట్టాసెప్పంద్రా, ఏవే కాసులూ, ఏరా ఏసేబూ-మొన్నామద్దిన అడి మాటినైదని సన్నాసిగాడు యేం సేసేడో గుర్తునేదూ? మీకు ఒక పూట పని దొరికినాదా? అడి కాళ్ళట్టుకునే వరకూ తిండి దొరికినాదా? మళ మల మాడి పోనేదూ! ఆడికి పెద్దోళ్ళ అండ వున్నాది. ఆడి మాటంటే ఆళ్ళందరికీ గురి. ఆడేం సేసినా మనం నోరు మూసుకుని వూరుకోవాల. అర్ధమవుతోందా. ఏం సేత్తాం. మన బతుకు లింతే. ఆడితో దెబ్బలాట లెట్టుకుంటే ఈ మాత్తరం కూడా బతకలేం " అన్నాడు రావన్న తాత చాలా చాలా శాంతంగా.

అతని మాటలు వర్షపు చినుకుల్లా కురిసేయి, అగ్ని ఆరిపోయింది. అంతా అణిగిపోయింది.

వాళ్లంతా వెనక్కు వెళ్లిపోయారు. తాటాకు పాకల్లోకీ, గుడిసెల్లోకీ వెళ్లిపోయారు. నిరాశగా నిర్జీవంగా కూలబడిపోయారు.

వాళ్లిప్పుడు కడిగిన ముత్యాల్లా లేరు - మాసిన గుడ్డల్లా వున్నారు. కరెంటు దీపాల్లా లేరు-కిరసనాయిలు దీపాల్లా వున్నారు.

తాటాకు పాకలూ గుడిసెలూ మౌనంగా వున్నాయి. పొయ్యిలు మౌనంగా వున్నాయి. సొట్టలు పడ్డ పిల్వరు గిన్నెలూ గరిటెలూ మౌనంగా వున్నాయి. వాళ్ళూ మౌనంగానే వున్నారు.

గాలి మౌనంగా వుంది. చీకటి మౌనంగా వుంది. పాపం, నేలతల్లీ మౌనంగా వుంది.

కానీ, వాళ్ళ మనసులు విలపిస్తున్నాయి. కళ్ళు నీళ్ళు కారుస్తున్నాయి. నరాలు నిరసిస్తున్నాయి.

ప్రతినెలా కట్టవలసిన అద్దె రూపాయల రూపంలో వాళ్ళముందు ప్రళయనృత్యం చేస్తోంది.

* * *

రావన్న తాతకి సన్యాసి యింటి పంచలో తలదాచుకోడానికి కాస్త స్థలం దొరికింది. అప్పుడప్పుడూ సన్యాసి యింట్లో మిగిలిన చేపల పులుసు కూడా కొంచెం దొరుకుతోంది.

('స్వాతి' మాస పత్రిక)